# 13. ఓ కట్టెలు కొట్టు వాడి కథ

పచ్చని ఎత్తయిన చెట్లతో దట్టంగా పెరిగిన ఒక చిట్టడవి వుంది. ఆ అడవికి అతి సమీపంలో-ఎర్రని మట్టితో-నల్లని రాళ్లతో-ఎర్రటి నల్ల కొండ వుంది. ఆ కొండకి దగ్గరగా ఒక చిన్న వూరు వుంది. ఆ వూరికి కొద్ది దూరంలో ఒక చిన్న గుడిసె వుంది. ఆ గుడిసె ముందు-ఒక చిన్న పొగాకు మడి వుంది.

ఆ మడిలో ఒకామె గొప్పు తవ్వుతూ, కలుపు మొక్కలు పీకుతోంది. ఆమెకు ఇద్దరు పిల్లలున్నారు. వాళ్లు చెట్ల కింద రాలిపడిన ఎండు పుల్లలు ఏరుతున్నారు. ఆ పిల్లల్ని చూసాక, ఆమె వయసు ముప్పయిలోపు వుంటుందని ఎవరైనా తెసుకోగలు.

నిజాలే గానీ కతలు లేని ఆమె జీవితంలో చిరు నిజాల చిన్న కత వుంది.

ఆ కత ఆమె చెప్పింది.

ఆమె ఆడది అవడంవల్ల, ఆమె కొక మొగుడుండేవాడట. అతడు చదువు కోకపోడం వల్ల, కాయకష్టం మీద బతకవలసివచ్చిందట. చదువుకోకపోయినా, మోసం - దగా చేయడం రాకపోడం చేత, శరీరబలంమీద బతకవలసివచ్చిందట. అతడు రాజకీయాల్లో తలదూర్చక పోవడం చేత - సుఖంగా బతకడానికి - కష్టం లేకుండా డబ్బు సంపాదించలేకపోయాడట!

అంచాత, అతడు ఒక కట్టెల వ్యాపారివద్ద కట్టెలు కొడుతూ జీవిస్తున్నాడట.

అప్పుడతడు ఆమెను పెళ్లి చేసుగున్నాడట. పెళ్లయిన కొత్తలో - యవ్వనం పొంగులో - దరిద్రం దహిస్తున్నా - కామం కట్టలు తెంచుకోడంవల్ల, కష్టాల్ని లెక్క చేయకుండా, సుఖంగా బతుకుతున్నట్లు అనుకున్నారట.

తర్వాత అతడు, కండలు కరుగుతున్నా, కడుపు నిండకపోడంవల్ల, పెళ్లాడ్డం పొరపాటని అంటూ వుండే వాడట. ఆడదాని కోసం ఆకలితో పుట్టించిన దేవుణ్ని తిడుతూ వుండేవాడట. ఇద్దరు పిల్లలు పుట్టేరట. ఆమె ఆరోగ్యం చెడిపోయిందట. ఏ పనీ చేసి, ఏ విధంగాను, అతడికి సాయంచేయ లేకపోయేదట. అప్పుడతడు, నిరాశగా, నిస్పృహగా, జీవితాన్ని గడుపుతూ వుండేవాడట.

పచ్చి కలపకు కండచీమలూ-ఎండు కలపకు బండచీమలూ అంటి పట్టుగుని గుంపులు గుంపులుగా వుండేవట. ఎంత జాగర్తగా వున్నా, అవి అతణ్ని కరుస్తూ వుండేవట.

రోజూ రాత్రి గుడిసె ముందు, కుక్కి నులక మంచం మీద నడుం వాల్చేవాడట.

ఆకలి మంటకు తోడు - అన్యాయం అగ్గికి తోడు - చీమలు కుట్టిన మంటలు తోడై - పెళ్లాం మీదా - పిల్లల మీదా - దేవుడి మీదా - కట్టెల వ్యాపారి మీద - దరిద్రం మీదా-

మండి పడిపోతూ వుండేవాడట.

అతడు మంచం మీద దొర్లుతూ, ఆకాశంలోకి చూస్తూ, ఆలోచిస్తూ, నిద్ర లేకుండా రాత్రుళ్లు గడుపుతూ వుండేవాడట.

కండలు కరుగుతున్నా తిండి లేకపోవడం-చెమట బిందువు రాలకుండా కనకరాసులు పోగవడం-అలాంటి దృశ్యాలు అతడి కళ్ల ముందు తిరుగుతున్నట్లు - అతడు ఆమెతో చెప్తూ వుండేవాడట.ఆ కనకరాసుల వెనక–నేరాల పోగులూ-మోసాల కుప్పలూ-కన్నీటి కాల్వలూ-రక్త ప్రవాహాలూ-అతడు విన్నవీ, కన్నవీ-ఆమెకు కబుర్లుగా చెప్తూ వుండేవాడట.

అలా అతడికి, క్రమంగా న్యాయం మీద నమ్మకం పోయిందట. ధర్మం మీద ఆసక్తి చచ్చిపోయిందట. అహింస అబద్ధమని అంటూ వుండేవాడట.

అన్యాయం ఎలా పోతుంది?! దరిద్రం ఎలా పోతుంది?! కష్టాలు ఎలా పోతాయ్?! హింస ఎలా పోతుంది?!-అని తరచుగా, ఆవేదనతో, అంటూ వుండేవాడట.

ఒక రోజు అర్ధరాత్రి వేళ - అతడు వాకిట్లో నులక మంచం మీద, నిద్ర లేకుండా దొర్లుతున్నప్పుడు - ఎవరో ఇద్దరు వచ్చారట. వాళ్లు ఎత్తుగా, లావుగా, బలంగా, నల్లగా, వున్నారట. వాళ్లు అతడితో కొంత సేపు గుసగుసలాడేరట. అలా కొన్ని నిమషాలు గడిచాక, అతడు గుడిసెలోకి వచ్చాడట. దీపం చేత్తో పట్టుకున్నాడట. నిద్రపోతున్న పిల్లల్ని ఆ దీపం వెలుగులో చూసాడట. ఆమె ముఖంలోకి చూసాడట. ఆమె భుజం మీద తట్టాడట. ఆమె బుగ్గల్ని నిమిరాడట. అతడు ఆమెతో ఏవీ చెప్పగుండా, వాళ్లతో ఆ చీకట్లో వెళ్లిపోయాడట.

ఆ తర్వాత అతడు ఇంటికి తిరిగి రాలేదట. అతడి కోసం ఎదురు చూస్తూ, వెదుకుతూ, కొన్నాళ్లు గడిపిందట. ఆ తర్వాత అతడు చచ్చిపోయాడని తెలిసిందట. అతడు ఎలాపోయాడో ఆ తర్వాత ఎవడో చెప్పాడట. అన్ని వూళ్లల్లోలాగే, ఆ వూళ్లోనూ ఒక ధనవంతుడు న్నాడట. అతడు చాలా గొప్ప ధనవంతుడట. అతడికి బలవంతుడైన విరోధి వున్నాడట. ఆ ధనవంతుడు ఆ బలవంతుడైన విరోధిని చంపినవాడికి అయిదు వేల రూపాయలు ఇస్తానన్నాడట.

అన్యాయం ఎలా పోతుంది?! దరిద్రం ఎలా పోతుంది?! కష్టాలు ఎలా పోతాయ్?! హింస ఎలా పోతుంది-అని పరితపిస్తున్న అతడు, అయిదు వేల రూపాయల కోసం, ఆ ధనవంతుడి విరోధిని చంపే ప్రయత్నంలో అతడే చచ్చిపోయాడట.

అయితే - దట్టమైన చిక్కని ఆ అడవుల్లో -చిన్న చిన్న మంటలు మండుతున్నాయనీ-ఆ మంటలకు కట్టెలు కావాలనీ-తెలుసుగున్న ఆ కట్టెలు కొట్టువాడు-ఆ అడవుల్లోకి వెళ్లిపోయాడనీ-అతడు బతికే వున్నాడనీ-ఆమెకు తెలీదట!

కొందరు నిజాన్ని కథగా చెప్పగల్రు! కొందరైతే, కథని నిజంగా చెప్పగల్రు!

(సృజన-మాసపత్రిక-మే, 1972)